క్లుప్తంగా

ఆలయానికి విరాళం

కడియం: స్థానిక కెనాల్ రోడ్డులోని రాజవీధిలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి బొమ్మిరెడ్డి బూరయ్య కుమారుడు బొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి సోదరుడు బొమ్మిరెడ్డి వీర శంకరరావు రూ.1.25 లక్షల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ మొత్తాన్ని డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని దాత కోరినట్టు ఆలయ చైర్మన్ దాసరి శేషగిరి తెలిపారు.

ప్రత్యేక పూజలు

కడియం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో పలు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే కమ్మవారి రామాలయం వద్ద ఏకాహం నిర్వహించారు. భజనపాళీలు 24 గంటల పాటు భక్తిగీతాలను ఆలపించాయి.

డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,100 క్యూసెక్కులు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.80 అడుగులుగా ఉంది.

సెబ్ అధికారుల దాడులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బంది శుక్రవారం సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు కేసులు నమోదు చేసి దివాన్ చెరువు గ్రామానికి చెందిన మార్గాని వెంకట్, హుకుంపేటకు చెందిన ఈత సాయికుమార్, గంగులరాజు, రాజానగరానికి చెందిన పీత పోసిలను అదుపులోకి తీసుకున్నారు. 213 లీటర్లను సారా, తయారీ సామగ్రి, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు.

కందుల దుర్గేష్‌కు మాతృవియోగం


మేడా పద్మావతి (ఫైల్)

సీటీఆర్ఐ: జనసేన పార్టీ నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్‌కు శుక్రవారం మాతృవియోగం కలిగింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తల్లి మేడా పద్మావతి శుక్రవారం మృతి చెందారు. నిడదవోలులో నామినేషన్ కార్యక్రమంలో ఉన్న కందుల దుర్గేష్ ఈ వార్త తెలిసింది.

ఇన్‌స్టో ఒలింపియాడ్‌లో విద్యార్థులకు ర్యాంకులు


ఇన్‌స్టోలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కంబాలచెరువు: మూడు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఇటీవల జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ టెస్ట్ (ఇన్‌స్టో)లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల జోన్ ఏజీఎం ఎంవీ సురేష్ శుక్రవారం తెలిపారు. తమ విద్యార్థులు 8 మంది గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌లను గెలుచుకున్నారన్నారు. అలాగే 160 మంది టాప్ ర్యాంకులు సాధించి స్పెషల్ ప్రైజ్‌లను సాధించారన్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య బొమ్మూరు బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో స్కూలు అకడమిక్ డైరక్టర్ సీమ, రీజినల్ ఇన్‌చార్జులు, జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో భవ్యశ్రీ సత్తా


కాంస్య పతకం సాధించిన భవ్యశ్రీ

ప్రకాశం నగర్: మధ్యప్రదేశ్‌లోని ఇటీవల జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలలో దానవాయిపేట గాంధీ పార్కు సిటీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్‌కు చెందిన కె.భవ్యశ్రీ కాంస్య పతకం సాధించింది. అలాగే అండర్ – 17 బాలురు విభాగంలో ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్‌గా కెల్లా రాము ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు మరిన్ని పోటీల్లో పతకాలు సాధించి నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రేరణతో సృజనాత్మకత

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ప్రేరణ కార్యక్రమం ఉపయోగపడుతుందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో పాఠశాల స్థాయిలో 4,684 మంది ప్రేరణకు నమోదు చేసుకోగా, జిల్లా స్థాయికి 205 మంది ఎంపికయ్యారు.


వడిశలేరులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్


ఎస్టీ రాజాపురంలో సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అభిమానులు


రోడ్‌షోలో సీఎం జగన్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


రంగంపేటలో భారీగా తరలి వచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్డు


రంగంపేటలో సీఎం జగన్ కోసం ఎదురుచూస్తున్న నాయకులు


రంగంపేటలో సీఎం జగన్ రోడ్‌షో చూసేందుకు వచ్చిన ప్రజలు


వడిశలేరులో జై జగన్ అంటూ నినదిస్తున్న అభిమానులు

జననేతకు ఘన స్వాగతం

- సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- అభిమాన సంద్రంతో తడిసి ముద్దయిన మెట్ట
- అడుగడుగునా బ్రహ్మారథం పట్టిన ప్రజలు
- ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగిన ముఖ్యమంత్రి
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


రంగంపేటలో ప్రజలకు బస్సు పైనుంచి అభివాదం చేస్తున్న సీఎం జగన్

రంగంపేట: ఓవైపు 40 డిగ్రీల మండుటెండ.. మరో వైపు పొగలు కక్కుతున్న ఏడీబీ రోడ్డు.. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానం ముందు భానుడి భగభగలు సైతం చిన్నబోయాయి. సంక్షేమ సారథిగా తమ గుండెల్లో కొలువైన జగనన్నను చూసేందుకు గ్రామాలకు గ్రామాలే కదలి రావడంతో రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. లక్షలాదిగా తరలివచ్చిన అభిమాన సంద్రంతో మెట్ట తడిసి ముద్దయింది. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగన్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శుక్రవారం మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలోని గ్రామాల మీదుగా సాగింది. మార్గమధ్యలో అడుగడుగునా బస్సును ఆపి వృద్ధులు, చిన్నారులు, యువత, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ ముందుకు సాగారు. రోడ్‌షో సాగే రహదారికి ఇరువైపులా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ అభిమాన నేతను చూసేందుకు పోటీ పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే సీఎం జగన్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది.

రోడ్‌షో సాగిందిలా

గురువారం రాత్రి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురంలో బస చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరిగి యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తన కుటుంబ సభ్యులతో సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అనపర్తి నియోజకవర్గంలోని రంగంపేట మండలం ఎస్టీరాజాపురం, వడిశలేరు, రంగంపేట, కోటపాడు గ్రామాల మీదుగా యాత్ర సాగించారు. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు సీఎం జగన్‌ను చూసేందుకు తరలి వచ్చారు. పార్టీ జెండాలు చేతబట్టి ఎండను సైతం లెక్కజేయకుండా ఉత్సాహంతో కదం తొక్కారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని ఉదయం నుంచే ఎండను సైతం లెక్క చేయకుండా ఎదురుచూశారు. శుక్రవారం ఉదయం 10.46 గంటలకు ఎస్టీరాజాపురంలో బస్సు యాత్ర ప్రారంభమైంది. విడిది నుంచి బస్సు ఏడీబీ రోడ్డు పైకి రాగానే ప్రజలు, అభిమానులు, మహిళలు, యువకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సీఎం, సీఎం అంటూ నినాదాలు చేశారు. భారీగా తరలి వచ్చిన ప్రజలను చూసి సీఎం అభివాదం చేశారు. అనంతరం బస్సు డోర్ తీసి కాసేపు అభిమానులతో ముచ్చటించారు. సీఎం జగన్‌తో కరచాలనం చేసేందుకు యువత పోటీ పడ్డారు. అక్కడి నుంచి ముందుకు సాగుతూ అంబేడ్కర్ సెంటర్‌లో వేచి చూస్తున్న వృద్ధులు, మహిళలు, యువకులను చూసి ఆప్యాయంగా పలకరిస్తూ అభివాదం చేశారు. అనంతరం 11.04 గంటలకు వడిశలేరు సెంటర్‌కు వచ్చిన సీఎం బస్సుయాత్ర అక్కడ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, వడిశలేరు సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు ఆధ్వర్యంలో వేలాదిగా తరలి వచ్చిన జన సందోహానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేశారు.

వినతి పత్రాల స్వీకరణ

వడిశలేరు సెంటర్‌లో సీఎం జగన్ బస్సు దిగి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చాగల్నాడు ఎత్తిపోతల పథకం అభివృద్ధిని కోరుతూ రైతులు మామిరెడ్డి శ్రీరామకృష్ణ, నిమ్మలపూడి శ్రీధర్, నలమాటి భీముడు, బులిరాజులు ఇచ్చిన వినతి పత్రాన్ని తీసుకున్నారు. మెడికల్ టెస్ట్‌లో అనర్హత కారణంగా ఉద్యోగం కోల్పోయిన రాజానగరానికి చెందిన 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు తమకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. స్థానిక యువకులతో ముచ్చటించి కరచాలనం చేశారు. వడిశలేరులో మహిళలు సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో డ్యాన్సులు చేశారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామానికి 11.29 గంటలకు చేరుకున్న బస్సు యాత్ర అక్కడ అనపర్తి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, బిక్కవోలు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, రంగంపేట మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో మూడు మండలాలకు చెందిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలకు అధిక సంఖ్యలో సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు బస్సు పైకి చేరుకుని అందరికీ అభివాదం చేశారు. ఈ సందర్భంగా యువత సీఎం, సీఎం అంటూ నినాదాలతో కూడలి మొత్తం హోరెత్తించారు. అనంతరం 11.36 గంటలకు రంగంపేట నుంచి బస్సుయాత్ర బయలుదేరి 11.49 గంటలకు కోటపాడు చేరుకుని అక్కడ తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చిన జనానికి అభివాదం చేసుకుంటూ 12.20 గంటలకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది.


వడిశలేరులో ఆనందంతో డ్యాన్స్ చేస్తున్న మహిళలు

ఏడీబీ రోడ్డుపై అభిమానుల బారులు

రాజానగరం: ఎస్టీ రాజాపురంలో రాత్రి బస చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రజలు స్థానిక ఏడీబీ రోడ్డుపై బారులు తీరారు. ఉదయం 8 గంటలకే బస చేసే ప్రాంతానికి భారీగా చేరుకున్నారు. అలాగే సీఎం జగన్‌ను కలిసేందుకు వివిధ ప్రాంతాల నుండి పలువురు నేతలు కూడా తరలివచ్చారు. వారిలో రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడుదల రజనీ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, అనంతబాబు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, జ్యోతుల చంటిబాబు, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, నాయకులు జక్కంపూడి గణేష్, జక్కంపూడి విజయలక్ష్మి, నల్లమిల్లి శేషారెడ్డి, కాకినాడ మాజీ మేయర్ సరోజ తదితరులు ఉన్నారు.


సీఎం జగన్ బస్సు యాత్రలో పాల్గొన్న సినీ నటుడు గౌతంరాజు


ఎస్టీ రాజాపురంలో తమ నాయకుడి రాక కోసం ఎదురుచూస్తున్న యువత

రెండోరోజు సిటీలో నామినేషన్లు నిల్

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో రెండోరోజు శుక్రవారం అభ్యర్థులెవ్వరూ నామినేషన్లు దాఖలు చేయలేదని రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనరు దినేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకూ ప్రతి రోజూ (21 ఆదివారం మినహా) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నగరపాలక సంస్థలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నియమాలను రాజకీయ పార్టీల అభ్యర్థులు కచ్చితంగా పాటించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


ధవళేశ్వరంలో స్వామివారి గ్రామోత్సవం

ధవళేశ్వరం: గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం స్వామివారి గరుడోత్సవం వైభవోపేతంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.నాగసురేష్, దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ), ఆలయ ప్రధానార్చకుడు పొన్నూరి అనంత సత్య వల్లభాచార్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చులపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో జై అరవింద్

సీటీఆర్ఐ: ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు ఖర్చుల విషయంలో పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, అదే సమయంలో ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్లమెంట్ ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు జై అరవింద్ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత వివరాలు తెలియజేస్తూ జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి కార్యాచరణ రూపొందించామన్నారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టినట్టు తెలిపారు. ఖర్చుల పరిశీలనపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ ఎస్. తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కే.దినేష్ కుమార్, డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదల అభ్యున్నతి


జేగురుపాడులో ప్రచారం చేస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: కులాలు, మతాలకు అతీతంగా పేదలందరూ బాగుండాలంటే సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఆ గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాలను బాగు చేసేందుకు సీఎం జగన్ అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలు ఇదే విధంగా కొనసాగాలంటే జగన్ విజయం రాష్ట్ర ప్రజలకు అత్యావసరమన్నారు. అందుకోసం రూరల్ ఎమ్మెల్యేగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీర శివాజీ, స్థానిక నాయకులు పుట్ట బుజ్జి, బుడ్డిగ లక్ష్మణరావు, వరసాల మాధవరావు, సాకా కిరణ్‌కుమార్, బళ్ల అన్నవరం, మద్దుకూరి గోపీ, బోడపాటి చిన్నారావు, శ్రీను, శరత్, మోహన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు


సమావేశం నిర్వహిస్తున్న ఎన్నికల పరిశీలకులు

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సిబ్బంది తమ విధులను పారదర్శకంగా నిర్వహించాలని పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థుల ఖర్చుల పరిశీలకుడు జై అరవింద్, సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఖర్చుల పరిశీలకుడు నితిన్ కురియెన్ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఎన్నికల విభాగాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్, సిటీ ఆర్‌ఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ మొదటి అంతస్తులో సహాయ ఖర్చుల పరిశీలకుల కార్యాలయం, మూడో అంతస్తులో ఉన్న కంట్రోల్ రూము ద్వారా అన్ని బృందాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగర నియోజకవర్గ పరిధిలో బృందాలను పర్యవేక్షిస్తున్న విధానాలను వివరించారు. నగరంలోకి వచ్చే మార్గాలైన లాలాచెరువు జంక్షన్, క్వారీ మార్కెట్ జంక్షన్, పేపరు మిల్లు వద్ద స్టాటిక్ సర్వైలెన్సు బృందాలను నియమించినట్టు తెలిపారు. మిగిలిన మార్గాలు రూరల్ పరిధిలో ఉన్నందున ఆ టీములతో సమన్వయం చేసుకొని తనిఖీలు కొనసాగిస్తున్నామన్నారు. నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి అభ్యర్థుల ఖర్చును నిశితంగా పరిశీలిస్తామని, అందుకు తగిన విధంగా కంట్రోల్ రూములో క్షేత్రస్థాయిలో పూర్తి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు, డిప్యూటి కమిషనర్ ఎస్‌వీ రమణ, సహాయ ఖర్చుల పరిశీలకులు చంద్రశేఖర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: గడ్డి కోసేందుకు వెళ్లిన వ్యక్తి డ్రైనేజీలో పడి మృతి చెందాడు. హుకుంపేటకు చెందిన అవివాహితుడు పుట్టా శివరామకృష్ణ (42) తల్లితో కలిసి జీవిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గడ్డి కోసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి భోజనానికి రాకపోవడంతో అతడి సోదరుడు కృష్ణ చౌదరి, బంధువులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే సాయంత్రం 5 గంటల సమయంలో గోల్డెన్ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాలు వెనుక ఉన్న మేకప్పు చెరువు మెయిన్ డ్రైనేజీలో శివరామకృష్ణ మృతదేహం కనిపించింది. ఎండ తీవ్రతకు స్పృహ తప్పి డ్రైనేజీలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. బొమ్మూరు ఎస్సై బి.శ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కృష్ణ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి


ప్రచార వాహనాల అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన అన్ని అనుమతులు తీసుకుని మాత్రమే రాజకీయ పక్షాలు ప్రచారాలు చేసుకోవాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం మండలంలోని కడియం, పొట్టిలంక, కడియపులంక, జేగురుపాడు, మురమండ, మాధవరాయుడుపాలెం, కడియపుసావరం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రచార వాహనాల అనుమతి పత్రాలను పరిశీలించారు. అలాగే ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సాధనాలను అనుమతుల మేరకు ఏర్పాటు చేసిందీ, లేనిదీ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలను పట్టించుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే జేగురుపాడు, పొట్టిలంక గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సందర్శించారు. అక్కడ జరుగుతున్న వాహనాల తనిఖీలను పరిశీలించారు.

పేపరుమిల్లు కార్మికుల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పేపరుమిల్లు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని పేపరుమిల్లు ఆఫీసర్స్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపరుమిల్లు కార్మికుల సమస్యలను గురువారం బస్సు యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కార్మిక నాయకులతో కలసి తీసుకువెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపడతానని భరోసా ఇచ్చారని తెలిపారు. జిల్లాలో వేలమందికి జీవనాధారంగా ఉన్న పేపరుమిల్లును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు విద్యావ్యవస్థ గురించి తెలియకుండా, అజ్ఞానంతో మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పేపరు మిల్లు రిటైర్డ్ ఉద్యోగులు దల్లి వెంకటరెడ్డి, ఎస్‌కే సాయిబాబా, ఎస్‌వీవీ రెడ్డి, నెల్లి అప్పారావు, ఎ.అప్పారావు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల నామినేషన్

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.తేజ్‌భరత్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ముందుగా రాజమహేంద్రవరంలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి, పాత సోమాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భార్య, కుమార్తె, తమ్ముడి కుమారుడు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు.